సాక్షి అన్నమయ్య జిల్లా

గురువారం। 6। జూలై। 2023



అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

అనుమతి లేని విత్తనాలు, ఎరువులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. -8లో



ద్విచక్రవాహనం అదుపు తప్పి యువకుడు మృతి

ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెందాడు. మరొక వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1060	రూ.1240
రెండోరకం	రూ.900	రూ.1050



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 585 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	280	421
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 391.14 కిలోలు

న్యూస్‌రీల్

హుండీ ఆదాయం లెక్కింపు



వీరభద్రస్వామి ఆలయంలో హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, అధికారులు

రాయచోటి టౌన్: గత 100 రోజులలో రాయచోటి శ్రీ వీరభద్రస్వామి ప్రధాన ఆలయం,ఉపాలయాల హుండీల ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. రూ.23,60,540 నగదు, 82 గ్రాముల బంగారంతో పాటు 2.9 కిలోల వెండి లభించింది. ఆలయ పాలక మండలి అధ్యక్షురాలు పోలంరెడ్డి విజయ, ఈవో డీవీ రమణారెడ్డిల ఆధ్వర్యంలో జిల్లా దేవదాయశాఖ తనిఖీ అధికారి జనార్దన్ పర్యవేక్షణలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఫొటో, వీడియోగ్రఫీలో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, సెల్‌ఫోన్ రిపేర్/సర్వీసింగ్‌లో 26వ తేదీ నుంచి నెల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సెంటర్ మేనేజర్ ఎస్.నారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే సీసీ టీవీ, కెమెరా ఇన్‌స్టలేషన్/సర్వీసింగ్‌లో 13 రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు. 18–45 సంవత్సరాల మధ్య వయస్సు గల నిరుద్యోగ యువకులు శిక్షణకు అర్హులన్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా వాసులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు 9440905478, 9985606866 నంబర్లలో సంప్రదించాలన్నారు.

నందలూరు, ఓబులవారిపల్లెలో హాల్టింగ్స్



విశాఖ-కడప మధ్య నడిచే తిరుమల ఎక్స్‌ప్రెస్

రాజంపేట: నందలూరు, ఓబులవారిపల్లె రైల్వే స్టేషన్లలో 10వ తేదీ నుంచి మళ్లీ పలురైళ్లకు ప్రయోగాత్మక హాల్టింగ్స్ ఇస్తూ బుధవారం ఆదేశాలు జారీ అయ్యాయి. నందలూరులో తిరుపతి-కొల్హాపూర్ మధ్య నడిచే రైలు (17415/17416), విశాఖపట్నం-కడప మధ్య నడిచే (17488/17487) తిరుమల ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇచ్చారు. అలాగే ఓబులవారిపల్లెలో తిరుపతి-కొల్హాపూర్ (17415/17416), తిరుపతి-నిజాముద్దీన్ మధ్య నడిచే(12793/12794) రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ ఇచ్చారు. ఈ రెండు రైల్వేస్టేషన్లలో టికెట్స్ కొనుగోలుపై సమీక్షించి ఆదాయాన్ని బట్టి హాల్టింగ్‌లపై తుది నిర్ణయం తీసుకుంటారు.

దివ్యాంగులకు చేయూత

- జిల్లాలో 57 మందికి మూడు చక్రాల మోటారు వాహనాలు
- నేడు 150 మంది కాళ్లు లేని వారికి కృత్రిమ కాళ్లు ఉచితంగా పంపిణీ
- రాజంపేట ఎంపీ చేతుల మీదుగా రూ.1.46 కోట్ల విలువైన ఉపకరణాల అందజేత



దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు పంపిణీ చేస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు (ఫైల్)

రాయచోటి: దివ్యాంగులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అండగా నిలుస్తోంది. వారి సంక్షేమమే లక్ష్యంగా వివిధ పథకాలను ప్రవేశపెట్టింది. పింఛన్లతో ఆదుకున్న ప్రభుత్వం.. వికలాంగుల సంక్షేమ శాఖ ద్వారా దివ్యాంగులకు చేయూతనిచ్చారు. ఈసారి వారి సంక్షేమం కోసం కోట్లు వెచ్చించిన ప్రభుత్వం. మరిన్ని పథకాలను తీసుకువస్తోంది. కారణమేదైనా దివ్యమైన జీవితాన్ని వైకల్యం వెంటాడుతున్న వారి జీవితాలలో రాష్ట్ర ప్రభుత్వం చైతన్యం నింపుతోంది. ఆత్మస్థైర్యం, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగి అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు తీసుకుంటోంది. మీకు అండగా ఉన్నామంటూ వారిని అక్కున చేర్చుకుంటోంది. వారి సంక్షేమానికి గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా అత్యాధునిక ఉపకరణాల పంపిణీకి నాంది పలికింది.. బ్యాంకురుణాలు, ఉమ్మడి జిల్లాల్లో బ్యాక్ లాగ్ పోస్టుల భర్తీ వరకు ఎక్కడా ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూస్తోంది. వారి మోముల్లో ఆనందం వెల్లివిరిసేలా చేస్తోంది.

శారీరక వైకల్యం అనేది మెరుగైన జీవనానికి అడ్డంకి కాదని, వారికి మరింత తోడ్పాటునందిస్తే ఏదైనా సాధించగలరనే గొప్ప ఉద్దేశంతో ప్రభుత్వం దివ్యాంగులకు చేయూతనిస్తోంది. వారికి అవసరమైన ఉపకరణాలను ఇస్తోంది. గత ఎన్నికలకు ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన పాదయాత్రలో అన్ని వర్గాల ప్రజల కష్టాలు, కన్నీళ్లను దగ్గరగా చూసి అధికారంలోకి వచ్చి సీఎంగా.. బాధ్యతలు చేపట్టిన తర్వాత నవరత్నాల అమలుతో అందరికీ మేలు చేస్తూ వచ్చారు. అందులో భాగంగా దివ్యాంగులకు సైతం నేనున్నానంటూ భరోసా ఇస్తూ అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి విజయవంతంగా అమలు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కలెక్టర్ గిరీషా పీఎస్ దివ్యాంగులకు అందాల్సిన సంక్షేమ పథకాలపై ప్రత్యేక శ్రద్ధ వహించారు. సంబంధిత అధికారులతో నిరంతరం సమీక్షిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం నింపేలా క్రీడా పోటీలు నిర్వహిస్తున్నారు. దివ్యాంగ విద్యార్థులకు అవసరమైన ఉపకరణాల మొదలు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకునే విధంగా వారికి ల్యాప్‌ట్యాబ్‌లు, స్మార్ట్ ఫోన్లు వంటివి కూడా అందజేస్తూ మరింతగా ప్రోత్సహిస్తున్నారు.

నిరంతరం పది రకాల ఉపకరాణాలు పంపిణీ: మూడు చక్రాల మోటారు వాహనాలు, బ్యాటరీ ట్రైసైకిల్, ట్రైసైకిల్, వీల్‌చైర్, ల్యాప్‌టాప్, టచ్ ఫోన్, వినికిడి పరికరాలు, బ్లైండ్ స్టిక్స్, వృద్ధుల చేతికర్రలు వంటి పది రకాల ఉపకరణాలను దివ్యాంగుల అవసరాలను బట్టి నిరంతరం పంపిణీ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.1,62,29,800 వ్యయంతో ఉపకరణాలు అందజేసింది.

త్వరలో ఆదిప్ పథకం ద్వారా ఉపకరణాలు.. రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి చొరవతో ఎంపీ నిధుల నుంచి 1057 మంది దివ్యాంగులకు రూ.1.46 కోట్లు విలువైన ఉపకరణాలను పంపిణీ చేసేందుకు వికలాంగ సంక్షేమ శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

- జిల్లాలో నియోజకవర్గానికి 10 చొప్పున 57 మంది దివ్యాంగులకు మూడు చక్రాల మోటారు వాహనాలు రూ.68.4 లక్షలతో కలెక్టర్, శ్యాసనసభ్యులు చేతుల మీదుగా అట్టహాసంగా పంపిణీ చేశారు. ఇంకా 36 మందికి మూడు చక్రాలు మోటారు వాహనాలకు ప్రతిపాదనలు పంపారు.

రుణాలు: జిల్లాలో స్వయం ఉపాధి కలిగిన దివ్యాంగుల పురోగతికి 20 మందికి రూ.5 లక్షల చొప్పున కోటి రూపాయలు 2022–23 ఆర్థిక సంవత్సరానికి జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థ ద్వారా రుణాలు మంజూరు చేశారు. మరో 35 మంది వికలాంగులకు 2023–24 ఆర్థిక సంవత్సరానికి రుణాలు మంజూరుకు జేసీ ద్వారా జాతీయ వికలాంగుల ఆర్థిక అభివృద్ధి సంస్థకు ప్రతిపాదనలు పంపారు. అవి కూడా త్వరలో మంజూరు కానున్నాయి.

కృత్రిమ కాళ్లు అమర్చే కార్యక్రమం

జిల్లాలోని కాళ్లు లేని 150 మంది వికలాంగులకు ఈ ఏడాది జూన్ 2వ తేదీన కొలతలు తీసుకొని నేడు 6వ తేదీన కలెక్టర్ చొరవతో కృత్రిమ కాళ్లు ఉచితంగా అమర్చే కార్యక్రమానికి అధికారులు శ్రీకారం చుట్టారు.

ప్రభుత్వసాయాన్ని మరువలేం



నేను ఎంఏ బీఈడీ చదివాను. రాష్ట్ర ప్రభుత్వం మమ్ములను ప్రోత్సహిస్తూ మూడు చక్రాల స్కూటర్ అందజేయడం సంతోషం. దివ్యాంగులకు ప్రభుత్వం అందించిన సాయాన్ని మరువలేం.

– మల్లు సుబ్బనరసారెడ్డి, పుల్లంపేట మండలం

దివ్యాంగుల సంక్షేమానికి కృషి



దివ్యాంగ విద్యార్థుల చదువులకు ఉపయోగపడేలా ల్యాప్‌ట్యాబ్‌లు, బధిరులకు ఉపయోగపడేలా మొబైల్‌ఫోన్లు దశల వారీగా వికలాంగ సంక్షేమ శాఖ ద్వారా అందిస్తున్నాం. ఎంపీ ల్యాడ్స్ నిధులతో ఉపకరణాలను అందిస్తున్నాం. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

– పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ

పారదర్శకమైన సేవలు



దివ్యాంగుల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను పారదర్శకంగా నిర్వహిస్తూ సేవలందిస్తున్నాం. కలెక్టర్ సూచనలు, ఆదేశాల మేరకు దివ్యాంగుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. మరో వారంలో మూడు చక్రాల మోటారు వాహనాలు పంపిణీ చేస్తాం.

– కిషోర్, ఏడీ, దివ్యాంగుల శాఖ, అన్నమయ్య జిల్లా

దివ్యాంగుల ఆత్మస్థైర్యం స్ఫూర్తిదాయకం



దివ్యాంగుల ఆత్మస్థైర్యం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకం. ఎంతో మంది దివ్యాంగులు ఉన్నత స్థాయికి ఎదిగి ఉన్నారు. వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలు అందిస్తూ అండగా నిలుస్తున్నాం. దివ్యాంగుల సంక్షేమ శాఖతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నాం.

– గిరీషా పీఎస్, అన్నమయ్య జిల్లా కలెక్టర్

ఐటీఐలో షార్ట్ టర్మ్ కోర్సులు

కడప ఎడ్యుకేషన్: కడపలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజనా స్కీమ్(పీఎంకేవీవై) కింద 45 రోజులు, 90 రోజుల కోర్సులలో ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రభుత్వ డీఎల్‌టీసీ ఐటీఐ అసిస్టెంట్ డైరెక్టర్ రత్నరాజు తెలిపారు. వివరాలకు 9000366621, 9505965504 నంబర్లలో సంప్రదించాలన్నారు. కోర్సులు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రముఖ సంస్థల్లో ఉద్యోగావకాశాలను కల్పిస్తామన్నారు.

7న మెగా రక్తదాన శిబిరం

ఏఎఫ్‌యూ : కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలో ఈ నెల 7వ తేదీన మెగా రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు వీసీ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్ రెడ్డి తెలిపారు. మహానేత వైఎస్సార్ జయంతి నేపథ్యంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పరీక్షా ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

ఏఎఫ్‌యూ: కడపలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ప్లానింగ్ అండ్ ఆర్కిటెక్చర్, కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ విభాగాలకు సంబంధించిన రెండో, ఆరో సెమిస్టర్, రెగ్యులర్ పరీక్షా ఫలితాలు బుధవారం విడుదలయ్యాయి. వైస్ ఛాన్సలర్ ఆచార్య బి.ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి.సురేంద్రనాథ్‌రెడ్డి పరీక్షా ఫలితాలను స్క్రీన్‌పై విడుదల చేశారు. ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ రిజిస్ట్రార్ రాజేష్‌కుమార్ రెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డా. ఇ.సి. సుప్రియ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు టీడీపీలో విభేదాలు బట్టబయలు!

సాక్షి ప్రతినిధి, కడప: వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు నియోజకవర్గం టీడీపీలో అంతర్గత విభేదాలు బట్టబయలయ్యాయి. పోట్లదుర్తికి చెందిన సీఎం సురేష్ ఏర్పాటు చేసిన అన్న క్యాంటీన్ ప్రారంభోత్సవ సందర్భంగా మరోమారు తెరపైకి వచ్చాయి. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీకి చేరువ అయ్యేందుకు జిమ్మిక్కులతో ఎత్తుగడలు వేస్తున్నారని ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి మండిపడుతున్నట్లు సమాచారం. అయిష్టంగానే ప్రారంభోత్సవానికి హాజరైనా బహిరంగ సభకు దూరంగా ఉండిపోయారు. బీజేపీ నేత రాజ్యసభ సభ్యుడు సీఎం రమేష్ సోదరుడు సీఎం సురేష్ ప్రొద్దుటూరు అసెంబ్లీ టీడీపీ టికెట్‌పై కన్నేశారు. ఈనేపథ్యంలో అన్న క్యాంటీన్ పేరిట ఎత్తుగడలు వేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడుతో సహా అనేక మంది నాయకులను ఆహ్వానించారు. కాగా, మండలి విపక్షనేత యనమల రామకృష్ణుడు, మాజీ మంత్రి జేసీ దివాకర్‌రెడ్డి మినహా ఇతర ప్రాంతాలకు చెందిన వారు హాజరు కాలేదు. అందుకు కారణం టీడీపీ ఇన్‌చార్జి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి.. అతన్ని ప్రోత్సహిస్తున్న పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసులరెడ్డిలే ప్రధాన కారకులుగా పార్టీ నేతలు చెప్పుకొస్తున్నారు. ఇటీవల పాదయాత్రలో భాగంగా ప్రొద్దుటూరుకు వచ్చిన లోకేశ్ పార్టీ టికెట్ ప్రవీణ్‌కే అని పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. ఈ పరిణామాన్ని అడ్డుకునేందుకు టీడీపీ నేతలు తెరవెనుక మంత్రాంగాలు నిర్వహించి, సీఎం సురేష్‌ను తెరపైకి తెచ్చినట్లు తెలుస్తోంది. టీడీపీ అధికారంలో ఉండగా పోట్లదుర్తి బ్రదర్స్‌కు అగ్రపీఠం దక్కింది. అధికారానికి దూరం కాగానే సీఎం రమేష్ బీజేపీ పంచన చేరారు. ఆయన సోదరుడు సురేష్ కూడా నాలుగేళ్లుగా పార్టీకి అంటీముట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో అన్న క్యాంటీన్ అంటూ గ్రూపు రాజకీయాలకు తెరలేపుతున్నారని ఆర్ శ్రీనివాసులరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డిలు యనమలకు ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

రమణీయం.. సౌమ్యనాథుని రథోత్సవం



ఆలయ మాఢవీధుల్లో భక్తజన సందోహం మధ్య కదులుతున్న రథం

నందలూరు(రాజంపేట): సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఆలయ మాఢవీధుల్లో రథోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత స్వామివారిని సుందరంగా అలంకరించి రథంపై కొలువు దీర్చారు. వైఖానస ఆగమశాస్త్ర పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల గోవిందా గోవిందా అంటూ రథాన్ని లాగారు.ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా రాజంపేట, నందలూరు పోలీసులు బందోబస్తును నిర్వహించారు.రథోత్సవం ముగింపు సందర్భంగా తూర్పు గాలిగోపురం వద్ద పూజ కార్యక్రమాలను టీటీడీ అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురిని సన్మానించారు. ఎంపీపీ మేడా విజయ భాస్కర్‌రెడ్డి పూజలు చేశారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ సోదరుడు ఆకేపాటి అనిల్‌రెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే సోదరుడు భూమనశంకర్‌రెడ్డి, సినీనటుడు తోట వేణు, ఆలయ మాజీ చైర్మన్ అరిగెల సౌమిత్రి, స్థానిక నేత అరిగెలనాని, ఎంపీటీసీ సునీతా ప్రభాకర్, నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ సర్పంచి జంబుసూర్యనారాయణ,ఎస్సీ విజిలెన్స్ సెల్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు నాగసుబ్బయ్య, డిప్యూటీ ఈవో నటేష్‌బాబు, అర్చకులు పాల్గొన్నారు.

అదిరేట్టు..ఐదారు రెట్లు

ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పెన్షన్ స్కీమ్

- ప్రభుత్వం అవిశ్రాంత కానుక
- జిల్లాలో 2155 మందికి లబ్ధి



మదనపల్లె ఆర్టీసీడిపో ప్రాంగణం

జిల్లాలో ప్రయోజనం చేకూరనున్న ఆర్టీసీ ఉద్యోగుల వివరాలు..

డిపో	ఉద్యోగులు
మదనపల్లె–1	456
మదనపల్లె–2	417
పీలేరు	431
రాజంపేట	337
రాయచోటి	500
డిపిటిఓ కార్యాలయం	14
మొత్తం	2155 మంది

మదనపల్లె సిటీ: రాష్ట్ర ప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఉద్యోగుల భద్రతే పరమావధిగా పని చేస్తోంది. ఇందులో భాగంగా దేశంలో ఎక్కడా లేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా మార్చింది. వారి జీవితాల్లో వెలుగులు తెచ్చింది. ఈ ఘనత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికే దక్కింది. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమానికి మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు ఈ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీమ్ (హయ్యర్ పెన్షన్) కు ప్రభుత్వం నూతన ప్రణాళిక సిద్ధం చేసింది. దీంతో ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అధిక మొత్తంలో పెన్షన్‌ను జీవితాంతం అందుకునేందుకు బాట పడింది. వీరు ఉద్యోగ విరమణ అనంతరం కనీసం రూ.మూడు వేల పెన్షన్ మాత్రమే పొందేవారు. ఈ హయ్యర్ స్కీమ్ ద్వారా ఇప్పటి వరకు అందే పెన్షన్ కన్నా 5 నుంచి 6 రెట్లు పెరిగే అవకాశం ఉంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు మరోసారి అవకాశం కల్పించింది. ఈ స్కీమ్‌లో నమోదయ్యేందుకు ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో వివరాలు అప్‌లోడ్ చేసే విధంగా చర్యలు చేపట్టింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజీ మెకానిక్‌లు, సెక్యూరిటీ కార్యాలయ సిబ్బంది అర్హులు. జిల్లాలో మదనపల్లె వన్, టు, పీలేరు,రాజంపేట, రాయచోటి డిపోలున్నాయి. రాయచోటిలోని డీపీటీఏ కార్యాలయంలో సిబ్బంది పని చేస్తున్నారు. వీటిలో 2155 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 8 నుంచి మే 3 వరకు, రెండో విడత మే 4 తేదీ నుంచి జూన్ 26 వరకు అవకాశం కల్పించింది. కొద్దిమంది సాంకేతిక కారణాలతో చేసుకోకపోవడం వల్ల మరో సారి అవకాశం కల్పించింది. మూడో విడత జూన్ 27 నుంచి జులై 11 వరకు గడువు ఇస్తూ నమోదు చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయిస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

అవగాహన కల్పించాం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. జిల్లాలో అయిదు డిపోల్లోని ఉద్యోగులకు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదుకు అవగాహన కల్పించాం. ఇది ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

–రాము, జిల్లా ప్రజారవాణా అధికారి, రాయచోటి

ఉద్యోగులకు మేలు



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం మేలు చేసింది. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అధిక పెన్షన్ పథకం తీసుకురావడం సంతోషం.

–మూరే వెంకటరమణారెడ్డి, ఆర్టీసీ వన్ డిపో డీఎం,మదనపల్లె

ఆ ఘనత సీఎం జగన్‌దే



ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అరకొర పింఛన్ వస్తుందని ఆందోళన చెందాం. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ముఖ్యమంత్రి అధిక పెన్షన్ పథకం తీసుకురావడం సంతోషంగా ఉంది. నమోదు అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశం కల్పిస్తే వెసులుబాటుగా ఉంటుంది. దీనిపైనా ప్రభుత్వం పెద్ద మనసుతో ఆలోచించాలి.

–కె.శంకర్‌రెడ్డి, వైఎస్సార్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు, మదనపల్లె వన్‌డిపో

అశ్వవాహనంపై సౌమ్యనాథుడు



నందలూరు(రాజంపేట) : సౌమ్యనాథ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి సౌమ్యనాథస్వామి అశ్వవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవమూర్తిని సుందరంగా అలంకరించారు. వాహనంపై కొలువుదీర్చారు. ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాఢవీధుల్లో ఊరేగించారు. దారిపొడవునా స్వామివారికి భక్తులు కాయకర్పూరం సమర్పించారు. కార్యక్రమంలో టీటీడీ అర్చకస్వాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపాకలో రథోత్సవం



రాజంపేట : తాళ్లపాకలో శ్రీ చెన్నకేశవ స్వామి, శ్రీ సిద్దేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. ముందుగా శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి ఉత్సవమూర్తులను సుందరంగా అలంకరించారు. అనంతరం రథంలోని వేదికపై కొలువుదీర్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కామాక్షి సమేత శ్రీ సిద్దేశ్వరస్వామి రథోత్సవం కూడా నిర్వహించారు. టెంపుల్ ఇన్‌స్పెక్టరు బాలాజీ, సర్పంచ్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

పోగొట్టుకున్న బంగారం అప్పగింత

– నిజాయితీ చాటుకున్న మెడికల్‌షాపు యజమాని



శ్రీహరితకు బంగారం అప్పగిస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్ : ఓ మహిళ పోగొట్టుకున్న బంగారం తిరిగి అప్పగించి మెడికల్‌షాపు యజమాని తన నిజాయితీని చాటుకున్నాడు. వివరాలిలా ఉన్నాయి. పీలేరు పట్టణానికి చెందిన శ్రీహరిత ఆటోలో వెళుతూ మూడు రోజుల క్రితం తన బ్యాగ్‌ను జారవిడుచుకుంది. ఆ బ్యాగులో రెండు తులాల బంగారం ఉంది. స్థానిక అజంతా మిట్టన ఎస్వీ మెడికల్‌షాపు యాజమాని రమేష్ బ్యాగ్‌ను గుర్తించి తన వద్ద ఉంచుకున్నాడు. బ్యాగ్ కోసం ఎవరూ రాకపోవడంతో బుధవారం సీఐ మోహన్‌రెడ్డికి బంగారంతో కూడిన బ్యాగును రమేష్ అప్పగించాడు. బ్యాగులో ఉన్న ఆధారాల ప్రకారం బాధితురాలిని గుర్తించి సమాచారం ఇచ్చి శ్రీహరితకు బంగారం అందించారు. రమేష్‌ను సీఐ అభినందించారు.

ఆలయ హుండీ దొంగ అరెస్టు

చక్రాయపేట : మండలంలోని గంగారపువాండ్లపల్లె చింతల గంగమ్మ ఆలయంలో హుండీ పగలగొట్టి నగదు కాజేసిన దొంగను అరెస్టు చేసినట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. గత నెల 20న ఆలయంలోని హుండీ పగుల గొట్టి డబ్బు తీసుకెళ్లారని తమకు ఫిర్యాదు అందిందన్నారు. ఈ మేరకు సత్యసాయి జిల్లా తలుపుల మండలం మామిళ్లవారిపల్లెకు చెందిన ఎల్లారు కరుణాకరరెడ్డిని అరెస్టు చేసి రూ..5250ల నగదు స్వాధీనం చేసుకొన్నట్లు ఆయన తెలిపారు.



అనుమతిలేని విత్తనాలు విక్రయిస్తే చర్యలు

డీలర్ల అవగాహన సదస్సులో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్



జిల్లా వ్యవసాయ, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్, సీడ్స్ వ్యాపార దుకాణ దారులు, డీలర్ల ప్రత్యేక అవగాహన సదస్సులో మాట్లాడుతున్న జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

రాయచోటి : ప్రభుత్వ అనుమతి లేని విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు అమ్మితే కఠిన చర్యలు తప్పవని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ హెచ్చరించారు. బుధవారం అన్నమయ్య జిల్లా కేంద్రం, రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా వ్యవసాయశాఖ, విజిలెన్స్ శాఖల ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్స్, సీడ్స్ వ్యాపార దుకాణదారులకు, డీలర్లకు పురుగు మందులు, విత్తనాలు, ఎరువులు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ లైసెన్సు లేకుండా పురుగు మందులు, ఎరువులు, విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. ప్రతి దుకాణదారుడు విత్తనాలు, పురుగు మందులు, ఎరువులు కొన్న రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. గ్రామాలలో లూజ్ విత్తనాలు అమ్మరాదని, ఎవరైనా అమ్మితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఎంఆర్‌పీ ధరల ప్రకారం విక్రయించాలని సూచించారు. రీజనల్ విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ షేక్ మాసుం బాషా మాట్లాడుతూ డీలర్లు చట్టాన్ని అతిక్రమించకుండా వారి వ్యాపారాలను న్యాయబద్ధంగా చేసుకోవాలన్నారు. నాణ్యమైన విత్తనాలను, ఎరువులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు సరియైన సమయంలో అందేలా చూడాలన్నారు. రైతుల పక్షాన నిలబడి వారి అభివృద్ధికి సహకరించాలని సూచించారు. వ్యవసాయశాఖ జిల్లా అధికారి బి.చంద్ర నాయక్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఉత్పత్తులు, సరియైన ధరకు అందించేలా కృషి చేయాలని సూచించారు. స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు సరి చేయాలన్నారు. కాలం చెల్లిన విత్తనాలను ఎట్టిపరిస్థితిలో అమ్మకూడదన్నారు. విత్తన చట్టం ప్రకారం అన్ని నియమ నిబంధనలు పాటించాలన్నారు. సదస్సులో ఏడీఏ మజీద్ అహ్మద్, విజిలెన్సు అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ జి.ఇదురు బాషా, డీఏఓ ఆఫీస్ లోని క్వాలిటీ కంట్రోల్ ఏఓ బి.వెంకట మోహన్, విజిలెన్స్ ఏఓ బాల గంగాధర్ రెడ్డి, వ్యవసాయ సహాయ సంచాలకులు, జిల్లాలోని డీలర్లు పాల్గొన్నారు.

రూ. 79.75 కోట్ల పరిహారం పంపిణీ పూర్తి చేయాలి

జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి నిర్వాసితులకు రూ. 79.75 కోట్ల భూ పరిహారం పంపిణీ కార్యక్రమాన్ని వేగంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లాలో చేపట్టిన రహదారులకు సంబంధించి నిర్వాసితులకు పరిహారం చెల్లింపు, పెండింగ్ భూ సేకరణ అంశాలపై సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎన్‌హెచ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో డీఆర్ఓ సత్యనారాయణ, రాయచోటి, మదనపల్లి ఆర్డీఓలు రంగస్వామి, మురళీ, ఎన్‌హెచ్ అధికారులు, తహసీల్దార్లు, డీటీలు, వీఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణంలో జిల్లాను అగ్రస్థానంలో నిలపాలి

హౌసింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఇళ్ల నిర్మాణాలలో అన్నమయ్య జిల్లాను రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలపాలని జాయింట్ కలెక్టర్ అహ్మద్ ఖాన్ హౌసింగ్ అధికారులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ 45వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ జగనన్న ఇళ్ల నిర్మాణాలలో అన్నమయ్య జిల్లా ప్రస్తుతం నాల్గో స్థానంలో ఉందన్నారు. రాబోయే రోజులలో హౌసింగ్ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిపేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమానికి ముందు హౌసింగ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో జాయింట్ కలెక్టర్ రక్తదానం చేశారు. ఈ సందర్భంగా గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులకు నిర్వహించిన వివిధ క్రీడా పోటీలలో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలను ముఖ్యఅతిథులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శివయ్య, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, ల్యాండ్ అండ్ సర్వే జయరాజు, గ్రామ వార్డు సచివాలయాల జిల్లా కో–ఆర్డినేటర్ మనోహర్ రాజు, జిల్లాలోని హౌసింగ్ ఈఈలు, డీఈలు, ఏఈలు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకర్-లారీ ఢీ

– ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు



దెబ్బతిన్న బొగ్గులోడు లారీ

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట పోలీసు స్టేషన్ పరిధిలో కడప– రేణిగుంట జాతీయ రహదారిలో బుధవారం తెల్లవారు జామున మిల్క్ ట్యాంకర్,లారీ ఢీకొన్న ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కడప నుంచి గూడూరుకు వెళుతున్న పాల ట్యాంకర్, చెన్నై నుంచి బళ్లారికి బొగ్గులోడుతో వెళుతున్న లారీ బుధవారం తెల్లవారుజామున ఒంటిమిట్ట మండలంలోని మౌలాలి దర్గా సమీపంలోకి రాగానే ఢీకొన్నాయి. రెండు వాహనాలు రోడ్డుకు అడ్డంగా ఉండటంతో ఇరువైపులా వాహనాలు బారులు తీరాయి. సమాచారం తెలుసుకున్న ఒంటిమిట్ట పోలీసులు, హైవే పెట్రోలింగ్ సిబ్బంది జేసీబీతో స్థానిక ప్రజల సహకారంతో వాహనాలను పక్కకు తొలగించి వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఈ ప్రమాదంలో ట్యాంకర్ డ్రైవర్‌కు స్వల్ప గాయాలు కావడంతో వైద్యం కోసం కడప రిమ్స్‌కు తరలించారు.

జువైనల్ జస్టిస్ బోర్డు చైర్మన్, మెంబర్ల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

కడప అర్బన్ : బాలల సంక్షేమం, సంస్కరణల సేవల శాఖ ఆధ్వర్యంలో జువైనల్ జస్టిస్ బోర్డులో (పిల్లల రక్షణ మరియు సంరక్షణ) చైర్‌పర్సన్‌లు, సభ్యులుగా, సోషల్ వర్కర్ మెంబర్లుగా సేవలు అందించేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా మదనపల్లి అదనపు జిల్లా పర్యవేక్షణాధికారి జి. లక్ష్మీపతి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 13లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలను హెచ్‌టిటిపి://డబ్ల్యుసీడీఎస్‌సీ // డబ్ల్యుసీడీఎస్‌సీ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు. లేదా 97013 86650 నంబరులో సంప్రదించాలని కోరారు.

'జింకా'కు మొల్ల పురస్కారం

కడప కల్చరల్ : ప్రొద్దుటూరుకు చెందిన సాహితీ వేత్త జింకా సుబ్రమణ్యంకు మొల్ల పురస్కారం అందజేశారు. బుధవారం కడప నగరంలోని మొల్ల సాహిత్యపీఠం కార్యాలయంలో సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు విద్వాన్ గానుగపెంట హనుమంతరావు ఈ మేరకు జ్ఞాపిక, ప్రశంసాపత్రం, రూ. 5116 నగదు, శాలువతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా హనుమంతరావు మాట్లాడుతూ జింకా సుబ్రమణ్యం మహిళా సాహితీ వేత్తలను ప్రోత్సహిస్తున్నందుకు గుర్తించి ఈ పురస్కారాన్ని అందజేశామన్నారు. పురస్కార గ్రహీత జింకా సుబ్రమణ్యం స్పందిస్తూ తన సేవలను గుర్తించి మొల్లమాంబ పురస్కారం అందజేయడం తన అదృష్టంగా భావిస్తున్నానన్నారు. పీఠం సభ్యులు శేషారెడ్డి, పార్వతమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల వివరాలు లేకపోతే ఎలా?

- ఎంఈఓ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లపై జేసీ ఆగ్రహం
- షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఆదేశం



జగనన్న సురక్ష సర్వేని పరిశీలిస్తున్న జేసీ

పెద్దమండ్యం : గ్రామ సచివాలయం పరిధిలో ఉన్న పాఠశాలల్లోని విద్యార్థుల వివరాలు లేకపోతే ఎలా అంటూ ఎంఈఓ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లపై జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని శిద్దవరం గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయంలో రికార్డులను పరిశీలించారు. సిబ్బంది మూవ్‌మెంట్ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. సచివాలయం పరిధిలో అర్హులకు అందించిన సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. సచివాలయం పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న విద్యార్థుల వివరాలను వెల్ఫేర్ అసిస్టెంట్‌ను అడిగారు. సమాచారం తెలియదని చెప్పడంతో జేసీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ విషయమై ఎంఈఓతో జేసీ మాట్లాడారు. పాఠశాల వారీగా విద్యార్థుల వివరాలు తెలియకపోవడం ఏమిటని ఎంఈఓను ప్రశ్నించారు. ఎంఈఓ, వెల్ఫేర్ అసిస్టెంట్‌లకు షోకాజ్ నోటీసులు ఇవ్వాలని ఎంపీడీఓను ఆదేశించారు. అనంతరం శిద్దవరంలో జరుగుతున్న జగనన్న సురక్ష సర్వేని పరిశీలించారు. అర్హులై ఉండి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి జగనన్న సురక్ష ద్వారా అందించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని జేసీ అన్నారు. 11 రకాల సేవలను జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా తక్షణమే అందిస్తున్నట్లు తెలిపారు. సచివాలయం వద్ద జరిగే క్యాంపు రోజు సర్వేలో గుర్తించిన సమస్యలను అధికారులు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్‌లు వెంకటేశ్వర్లు, గౌరీశంకర్, సచివాలయ కార్యదర్శి హేమనాథరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కాంట్రాక్టు ఏఎన్ఎం మృతిపై విచారణ



సుజాత సంబంధీకులను విచారిస్తున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌సీ కృష్ణ

నందలూరు(రాజంపేట) : నాగిరెడ్డిపల్లె మేజర్ పంచాయతీ అరవపల్లెలో పనిచేస్తున్న కాంట్రాక్టు ఏఎన్ఎం సుజాత మృతిపై బుధవారం డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌ఓ డాక్టర్ ఎస్‌సీ కృష్ణ విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 10న ఏఎన్ఎం మృతి చెందిందన్నారు. ఆమె అనారోగ్య కారణంతో మృతి చెందినట్లు వైద్యాధికారిణి సృజన డీఎంఅండ్‌హెచ్‌ఓ కొండయ్యకు తెలిపారన్నారు. డీఅండ్‌హెచ్‌ఓ ఆదేశాల మేరకు విచారణలో భాగంగా మృతికి సంబంధించిన వివరాలను సంబంధీకులను అడిగి తెలుసుకున్నారు. మరణం తర్వాత ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక సాయం గతంలో రూ.2లక్షలు ఉండేదన్నారు. కాంట్రాక్టుగా పనిచేసే వారికి ఇప్పుడు రూ.3లక్షలు ప్రత్యేకంగా ఇవ్వాలని అధికారులకు నివేదిక పంపుతామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర సీహెచ్‌వోల సంఘం గౌరవాధ్యక్షుడు పిల్లిపిచ్చయ్య, యూడీసీ సిద్దిరామయ్య, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం అదుపుతప్పి యువకుడు మృతి

– మరొకరి పరిస్థితి విషమం



మృతి చెందిన వినయ్ కుమార్

కలికిరి : ద్విచక్రవాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో యువకుడు మృతి చెంది, మరొక వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం రాత్రి కలికిరిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... మండలంలోని పల్లవోలు గ్రామం పడమటిపల్లికి చెందిన భూమా వెంకటరమణ కుమారుడు భూమా వినయ్‌కుమార్(20) తన ద్విచక్రవాహనంలో పత్తేగడ గ్రామం కొట్టాలకు చెందిన సాహితీవేత్త జరుగుమల్లి వీరయ్యను ఎక్కించుకుని ఆర్టీసీ బస్టాండ్ వైపు బయలుదేరాడు. ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొంది. ప్రమాదంలో గాయపడ్డ ఇద్దరిని పక్కనే ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరీక్షించిన వైద్యులు వినయ్‌కుమార్ మృతి చెందినట్లు నిర్ధారించారు. వీరయ్య తలకు తీవ్రగాయాలై పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు. మృతుని కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడు మృతి

చక్రాయపేట : మండలంలోని సురభి గ్రామం రెడ్డివారిపల్లె సమీపంలో మూలకుంట చెరువు వద్దగల చీగలగుట్ట వద్ద బుధవారం సాయంత్రం విద్యుదాఘాతంతో సురభి బాబు (28) అనే యువకుడు మృతి చెందాడు. చక్రాయపేట పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని వేంపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

ఇరు వర్గాల ఘర్షణ

– పది మందికి గాయాలు

రామాపురం : మండలంలోని సరస్వతిపల్లె పంచాయతీ ఉడుమువారిపల్లెలో ఇరు వర్గాల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. పోలీసుల వివరాల మేరకు ఉడుమువారిపల్లెకు చెందిన అబ్దుల్‌సలాం, అల్లాబకష్ ఇరువురు సమీప బంధువులు. గత కొంతకాలంగా వీరిమధ్య స్థల వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో బుధవారం అల్లాబకష్ మద్యం సేవించి అబ్దుల్ సలాం కుటుంబ సభ్యులను దూషించడంతో ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈ ఘర్షణలో అబ్దుల్ సలాంతో పాటు మస్తాన్, మహమ్మద్‌గౌస్, దర్బార్‌లకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో వర్గానికి చెందిన అల్లాబకష్‌తో పాటు సర్దార్‌బాషా, నౌహీరా రియాజ్, ఖాదర్‌బాషా, ఖాదర్‌హుసేన్‌లను కడప రిమ్స్‌కు 108లో తరలించారు. పరిస్థితి విషమించడంతో సర్దార్‌బాషా, ఖాదర్‌బాషా, ఖాదర్‌హుసేన్‌లను రిమ్స్ నుంచి తిరుపతికి తీసుకెళ్లినట్లు బంధువులు తెలిపారు. ఈమేరకు 9 మందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

వింత వ్యాధితో పాడి ఆవు మృతి



రామసముద్రం : డాక్టర్లకే అంతు చిక్కని వ్యాధితో ఆవు మృతి చెందిన సంఘటన బుధవారం రామసముద్రం మండలం గుంతయంబాడి గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుని కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కె.శ్రీనివాసులురెడ్డి ఆవు గత రెండు రోజులుగా అనారోగ్యానికి గురైంది. వైద్యాధికారులకు సమాచారం అందించగా ఉదయం లైవ్ స్టాక్ అసిస్టెంట్ శేషాద్రి ఆవుకు చికిత్స నిర్వహించి వెళ్లారు. అయితే పాడి ఆవు మేత తినకుండా ఉండటంతో తిరిగి రైతు పశువైద్యాధికారులకు సమాచారం అందించాడు. మధ్యాహ్నం పశువైద్యాధికారి విద్య, సిబ్బంది వచ్చి పశువును పరిశీలించి చికిత్స అందించారు. అయితే ఆవుకు ఏమైందనేది పశువైద్యులకే అంతుపట్టక పోవడంతో చికిత్స తీసుకుంటూ మృతి చెందింది. సుమారు రూ.60 వేలు విలువ చేసే ఆవు చనిపోవడంతో రైతు బోరున విలపించాడు.

జాతీయ విద్యావిధానంతో విప్లవాత్మక మార్పులు

– వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : పాఠశాల విద్య నుంచి ఉన్నతవిద్య వరకు విప్లవాత్మక మార్పులకు జాతీయ విద్యావిధానం తోడ్పడుతుందని వైవీయూ వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్ అన్నారు. బుధవారం వైవీయూలో ఏపీ ఉన్నత విద్యామండలి విద్య ద్వారా సమాజ అభివృద్ధి బోర్డు (బి.సి.డి.ఈ) ఆధ్వర్యంలో సర్వశిక్ష అభియాన్, యునెసెఫ్ సంయుక్త ఆధ్వర్యంలో 'భాష అభివృద్ధి' (లాంగ్వేజ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాం)పై ఒక్కరోజు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అభ్యాసకుడికి పఠనం, మననం, చింతనం, సంకీర్తనం అవసరమన్నారు. మంచి విద్యార్థి అంటే ఉత్తమ అభ్యాసకుడన్నారు. బాలబాలికల అభ్యసన సాధనకు ఉన్నతవిద్యను అభ్యసించే విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలన్న ఆలోచన ఎంతో గొప్పదన్నారు.